సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం । 4 । మార్చి । 2023



రాజులా కేసీఆర్

సీఎం కేసీఆర్ రాజులా ప్రవర్తిస్తున్నారని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.

వివరాలు 8లో ▸



దర్శనీయ పర్వతంగా వట్టెం

వట్టెం వెంకన్నాలయం దర్శనీయ పర్వతంగా విరాజిల్లుతుందని చినజీయర్‌స్వామి అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 / 18.6

వాతావరణం

తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం నిర్మలంగా ఉండి ఉక్కపోసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో శాంతిభద్రతలు బాగు



లింగాల: జిల్లాలో శాంతిభద్రతలు బాగానే ఉన్నాయని, పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఎస్పీ మనోహర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ భరత్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నేరాలకు సంబంధించిన రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడాలని పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు పునరుద్ధరించడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

అందుబాటులో హాల్‌టికెట్లు

కల్వకుర్తి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల కళాశాల సీఓఈ కేంద్రాల్లో అడ్మిషన్ల కోసం ఆదివారం ప్రవేశపరీక్ష ఉందని జిల్లా గురుకులాల అధికారి దానం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 10 పరీక్ష కేంద్రాల్లో 4,020 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురుకుల సంస్థ అధికారిక వెబ్‌సైట్ https:tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, విద్యార్థులను గంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని ఆయన చెప్పారు.

యాక్షన్ ప్లాన్‌తో విద్యార్థులకు బోధన



తెలకపల్లి/పెద్దకొత్తపల్లి: విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీసే విధంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరెడ్డిపల్లి, పెద్దూరు, తెలకపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మండలంలో కొనసాగుతున్న మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, పనుల వేగవంతం గురించి ఆరాతీశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గర పడుతుందని, సమయాన్ని వృథా చేయకుండా పాఠ్యాంశాల పూర్తిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను చేరగలుగుతారన్నారు. ప్రతి విద్యార్థికి తనదైన శక్తిసామర్థ్యం ఉంటుందని, వాటిని ఉపాధ్యాయులు గుర్తించి వెలికి తీయాలన్నారు. ఉపాధ్యాయులు యాక్షన్ ప్లాన్‌తో విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయాల్లో సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ చంద్రుడు, ఉపాధ్యాయులు తదితరులున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రకల్, ముష్టిపల్లి, మర్రికల్, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ చంద్రుడునాయక్ తదితరులున్నారు.

వైద్యసేవలు మెరుగుపర్చాలి

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ప్రస్తుతం అందిస్తున్న సేవల కన్నా మరిన్ని మెరుగైన సేవలందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతం పలు పట్టణాలకు మధ్యలో ఉండటంతో ఇక్కడి వైద్యసేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా వైద్యులు ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టు కొరత ఉందని గుర్తుచేస్తూ, రెగ్యులర్ వైద్యురాలు ఉండేలా ఎమ్మెల్యే సహకారంతో కృషిచేస్తానన్నారు. ఆస్పత్రిలో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని డాక్టర్ శివరాంకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద కష్టాలకు చెక్

త్వరలోనే నార్లాపూర్, పెంట్లవెల్లి వంతెనల ప్రారంభం



పెంట్లవెల్లి సమీపంలో వాగుపై నిర్మించిన వంతెన

- ముక్కిడిగుండం ఉడుముల వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- పెద్దవాగుపై వంతెన ఏర్పాటుకు పూర్తయిన టెండర్
- వర్షాకాలం నాటికి అందుబాటులోకి పూర్తిస్థాయిలో తెచ్చేలా చర్యలు
- మారుమూల గ్రామాల్లో రాకపోకలకు తీరనున్న ఇబ్బందులు



ముక్కిడిగుండం సమీపంలో ఉడుముల వాగుపై నిర్మించిన వంతెన


కొల్లాపూర్: వర్షాకాలంలో పొరుగూరికి వెళ్లాలంటే ప్రధాన రోడ్డుపై పారే వాగులు దాటాలి. వాగులు ఉప్పొంగితే ఇక ఆ రోడ్డుగుండా ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిందే. లేదంటే చుట్టూ పదుల కిలోమీటర్ల మేర తిరిగి వెళ్లాల్సిందే. ఆపదొస్తే అంతే సంగతులు. దశాబ్దాలుగా వేధిస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేపట్టారు. ఎట్టకేలకు వారి పోరాటాలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలుచోట్ల నిర్మిస్తున్న మినీ వంతెనలు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే వాటిని ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.

రూ.6 కోట్లకు పైగా వ్యయంతో..

కొల్లాపూర్ నుంచి నార్లాపూర్ మీదుగా అచ్చంపేటకు వెళ్లేదారిలో పెద్దవాగు ప్రవహిస్తుంది. నార్లాపూర్, వేడుకరావుపల్లి గ్రామాల మధ్య పారే ఈ వాగుగుండా వానాకాలంలో రాకపోకలు సాగించడం గగనంగా మారేది. ఈ క్రమంలో 2010–11 వార్షిక ప్రణాళికలో ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెన, రహదారి నిర్మాణం కోసం రూ.5 కోట్లు కేటాయించారు. రోడ్డు నిర్మించి, వంతెన పనులను మధ్యలోనే కాంట్రాక్టర్ ఆపేశారు. రెండేళ్ల క్రితం రూ.కోటి నిధులు అదనంగా మంజూరు చేసి, పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ పనులు చివరి దశకు చేరగా.. సివిల్ వర్క్స్ కొనసాగుతున్నాయి. వంతెన మీదుగా వాహనాల రాకపోకలు సైతం సాగుతున్నాయి. త్వరలోనే అధికారికంగా వంతెన ప్రారంభించనున్నారు.

ఉడుముల వాగుపై..

కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం గ్రామానిది విచిత్ర పరిస్థితి. ఈ గ్రామానికి ఇటు నార్లాపూర్ మీదుగా, అటు మొలచింతలపల్లి మీదుగా వెళ్లేందుకు రెండు రహదారులు ఉన్నాయి. కానీ, ఈ రెండింటి గుండా వాగులు ప్రవహిస్తుంటాయి. వర్షాకాలంలో గ్రామానికి కొన్నిరోజులపాటు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. ఆయా వాగులపై వంతెనలు నిర్మించాలని



సుదీర్ఘకాలంగా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ క్రమంలో మొలచింతలపల్లి నుంచి ముక్కిడిగుండం వచ్చే దారిలో ఉడుముల వాగుపై పంచాయతీ రాజ్ శాఖ నాబార్డు నిధులు రూ.5.75 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం వంతెన పనులు పూర్తవగా.. అప్రోచ్ రోడ్డు, సివిల్ వర్క్స్ కోసం నిధుల కొరత ఏర్పడింది. దీంతో రూ.2 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

వంతెనల నిర్మాణ పనులను రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తున్నాం. పెంట్లవెల్లి, మల్లేశ్వరం గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెనలు దాదాపుగా పూర్తయ్యాయి. ఉడుముల వాగుపై వంతెన పనులు సైతం చివరి దశకు చేరాయి. ఇక్కడ అప్రోచ్ రోడ్డు, సివిల్ వర్క్స్ చేపట్టాల్సి ఉంది. దీనికి అదనపు నిధులు అవసరం కావడంతో రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

– సాయిరాంయాదవ్, పీఆర్‌ఏఈ

ఎన్నో ఏళ్ల కల..



మల్లేశ్వరం, వేంకల్, ఎంగంపల్లి గ్రామాల ప్రజలు రోజూ పెంట్లవెల్లికి వచ్చి పోతుంటారు. పెంట్లవెల్లి సమీపంలో రోడ్డుపై నుంచే వాగు పారితే రాకపోకలు కష్టం. దీనిపై బ్రిడ్జి కట్టాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు బ్రిడ్జి కట్టి మా కోరిక నెరవేర్చారు. బ్రిడ్జికి నిధులు ఇచ్చిన గవర్నమెంట్‌కు మా గ్రామాల ప్రజల తరపున కృతజ్ఞతలు.

– బాలరాజు, మల్లేశ్వరం

వంతెనలన్నీ పూర్తిచేయిస్తా



నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో మినీ వంతెనలు నిర్మించాల్సి ఉంది. వీటిని గతంలో నిర్లక్ష్యం చేశారు. అధికారులు, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించా. పెండింగ్ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తా. త్వరలోనే ముక్కిడిగుండం పెద్ద వాగుపై వంతెన పనులు ప్రారంభమవుతాయి. నార్లాపూర్, పెంట్లవెల్లి సమీపంలోని వంతెనలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

రూ.10 కోట్లతో మల్లేశ్వరం బ్రిడ్జి

పెంట్లవెల్లి– మల్లేశ్వరం గ్రామాల మధ్యన ప్రధాన రహదారి మీదుగా వర్షాకాలంలో వాగునీళ్లు పారితే రాకపోకలు పూర్తిగా ఆగిపోతాయి. పెంట్లవెల్లికి వెళ్లాలంటే మల్లేశ్వరం, వేంకల్, ఎంగంపల్లి గ్రామాల ప్రజలు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ వంతెన కోసం పంచాయతీరాజ్ శాఖ సీఆర్‌ఆర్ నిధులు రూ.10 కోట్లు మంజూరుచేసింది. 2022 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించగా.. ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. అప్రోచ్ రోడ్డు పనులు సాగుతుండగా నెల రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ వెంటనే ప్రారంభోత్సవం చేయనున్నారు.

నెలరోజుల్లో పెద్దవాగుపై..

నార్లాపూర్ నుంచి ముక్కిడిగుడం గ్రామానికి వెళ్లే దారిలో పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి రూ.9 కోట్లు ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. ఇటీవలే ఈ పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ నెలలోనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. పనులు పూర్తయితే ముక్కిడిగుండం గ్రామానికి వరద కష్టాల నుంచి విముక్తి లభించనుంది. దీంతోపాటు నియోజకవర్గంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా వాగులపై మినీ వంతెనలు నిర్మించనున్నారు.

సిలిండర్ల ధర పెంపు దారుణం



నాగర్‌కర్నూల్‌లో వంట చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే మర్రి తదితరులు

కందనూలు/ కల్వకుర్తి: ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలు అయిపోయిన వెంటనే ప్రతిసారి గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించి, వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మోదీ ఇచ్చిన కానుక ఈ సిలిండర్ ధరల పెంపా.. అని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న సిలిండర్ ధర రూ.1,200లకు చేరిందని విమర్శించారు. పెరుగుతున్న సిలిండర్ ధరలతో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారన్నారు.

నిరంకుశ వైఖరితోనే ధరల పెంపు

సామాన్య, మధ్యతరగతి ప్రజలతోపాటు ప్రతిఒక్కరు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్లపై భారీగా ధరలు పెంచడం హేయమైన చర్య అని ఎంపీ రాములు అన్నారు. కల్వకుర్తిలోని అమరవీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం నిరంకుశ వైఖరితో గ్యాస్ ధరలను పెంచిందని ఆరోపించారు. గ్యాస్ ధరలు పెరగడం వల్ల నిత్యావసర ధరలన్నీ పెరిగాయన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యుల బతుకులు భారంగా మారాయని వాపోయారు. ప్రధానమంత్రి మోదీ అసమర్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ మనోహర చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ గోవర్ధన్, విజయ్‌గౌడ్, సాయన్న మాదిగ, బాలయ్య, మనోహర్‌రెడ్డి, ఆంజనేయులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గుండూరు నుంచి రఘుపతిపేట వరకు నిర్మించే డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను ఎంపీ పరిశీలించి మూడు నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

గురుకుల విద్యార్థుల వనదర్శిని



ఫర్హాబాద్ అటవీ ప్రాంతంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటవీశాఖ సిబ్బంది

మన్ననూర్: ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల విద్యార్థినులు నల్లమల అటవీ ప్రాంతంలో పర్యటించారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన సఫారీ వాహనాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫర్హాబాద్ ప్రాంతంలోకి వెళ్లి అక్కడి ప్రకృతి, పరిసరాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా పర్యావరణ సమతుల్యం అందులో అడవులు, వన్యప్రాణుల మనుగడ తదితర అంశాలపై ఇష్టాగోష్టి నిర్వహించారు. అందుకు సంబంధించిన చిత్రాలను గీసి వివరించారు. అటవీ శాఖ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్వేత మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులతో ఉపయోగాలు, వాటి ప్రాముఖ్యత, వీటిపై ఆధారపడిన మానవ మనుగడ గురించి అవగాహన కల్పించారు. భూమి మీద స్వేచ్ఛగా జీవించే హక్కు మనుషులకు ఎంత ఉందో వన్యప్రాణులకు కూడా అంతే ఉందన్నారు. అడవులను రక్షించండి.. జంతువులను కాపాడండి.. గ్రామాల్లోని మన కుటుంబ సభ్యులతోపాటు సమీప కుటుంబాల వారికి విద్యార్థులు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లలితకుమారి, ఉపాధ్యాయులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా కలెక్టరేట్ సుందరీకరణ పనులు



కలెక్టరేట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: నూతన కలెక్టరేట్ ఆవరణలో చేపడుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లాకేంద్రం శివారు కొల్లాపూర్ చౌరస్తాలో చేపట్టిన కలెక్టరేట్ సుందరీకరణ, సీసీ రోడ్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్టికల్చర్ అధికారితో సమన్వయం చేసుకొని మొక్కలు నాటే ప్రక్రియను వారంలో పూర్తి చేసేలా ముందుకెళ్లాలని చెప్పారు. ఆవరణలో గ్రీనరీకి అత్యంత ప్రాధాన్యతనిస్తూ దట్టమైన గ్రీనరీ ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఏ రకమైన మొక్కలను ఎక్కడ నాటాలి.. మొక్కల సైజులను హార్టికల్చర్ అధికారితో చర్చించి వెంటనే పనులు పూర్తిచేయాలన్నారు. ఖాళీ స్థలం కనబడకుండా మొక్కలు పెంచాలని కోరారు. వచ్చే పది రోజుల్లో అన్ని పనులు పూర్తయ్యేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ భాస్కర్, హార్టికల్చర్ అధికారి చంద్రశేఖరరావు, అనిల్ ప్రకాష్, ఇంజినీర్లు తదితరులున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ విజయలక్ష్మి

అచ్చంపేట: ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాల, వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏ గ్రేడ్ సాధించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని కోరారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల 60 రోజుల ప్రత్యేక తరగతుల నిర్వహణ కార్యక్రమం అమలు తీరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందజేయాల్సిన అకాడమిక్, న్యూట్రిషన్, యుటిలిటీ కిట్లు అందాయన్న విషయం పదో తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు అందించాల్సిన దుస్తులు, కాస్మొటిక్స్, ఇతర వస్తువులు అందజేశారా.. లేదా అని ఆరాతీశారు. ఆమె వెంట ఏటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఏసీఎం ఆంజనేయులు తదితరులున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా

డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతి ఒక్క సహకార సంఘం బలోపేతం కోసం ఆయా సొసైటీల చైర్మన్లు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా కోరారు. శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మహాజనసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన 44 జీఓపై సభ్యులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సంఘాల బలోపేతం కోసం సభ్యులు నిర్వహించాల్సిన కార్యాచరణ గురించి వివరించారు. జిల్లాలోని సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు, తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్, రాష్ట్ర సహకార శాఖలు అనేక విధాలుగా సహకారం అందిస్తున్నాయని తెలిపారు. అంతేకాక నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అనేక సలహాలు, సూచనలు ఇస్తూ సహకార బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా 2022–23 సంవత్సరానికి ఆమోదించిన బడ్జెట్, 2022–23కు సవరించిన జమ ఖర్చులు, 2023–24 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను బ్యాంకు సీఈఓ లక్ష్మయ్య సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొరమోని వెంకటయ్య, బ్యాంకు డైరెక్టర్లు మంజులారెడ్డి, డి.బక్కన్నయాదవ్, తూము భీంరెడ్డి, కె.నరసింహారెడ్డి, ఎస్.భూపాల్‌రావు, కేవీఎస్ లక్ష్మీనారాయణ, చంద్రనాయక్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో కంటివెలుగు శిబిరం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి విజయ్‌కుమార్

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం అచ్చంపేట సివిల్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సివిల్ జడ్జి విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు అందజేయడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, న్యాయవాదులు మస్తాన్, రాజేందర్, సత్తయ్య, లక్ష్మీనారాయణ, మల్లేష్, బిక్‌లాల్, హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన



జెన్‌కో సిఈ కార్యాలయం గేటు వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

దోమలపెంట (అచ్చంపేట): టీఎస్‌పీఈ, జేఏసీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ, ఈపీఎఫ్ టు జీపీఎస్, ఆర్టీజియన్ల పర్సనల్ పే బేసిక్‌లో కలపాలని, మెడికల్ పాలసీ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈగలపెంటలో భూగర్భ కేంద్రం ఉద్యోగులు చేస్తున్న నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈగలపెంటలోని సీఈ కార్యాలయం శక్తి సదన్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో భూగర్భ కేంద్రం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎల్‌బీహెచ్‌ఈఎస్, జేఏసీ చైర్మన్ సునీల్, వివిధ సంఘాల నాయకులు లవ్‌కుమార్, యాదయ్య, శివశంకర్‌రెడ్డి, అశోక్, రెడ్యానాయక్, బిక్కులాల్, ఉద్యోగులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

7న హోలీ పండుగ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈ నెల 7వ తేదీన హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హోలీ ఎప్పుడు జరుపుకోవాలనే సందేహం చాలా మందిలో ఉందని, వీహెచ్‌పీ పెద్దలు వేదబ్రాహ్మణులను సంప్రదించగా వారి సూచన మేరకు ఈనెల 6న సోమవారం చతుర్దశి తిథితో పాటు పౌర్ణమి కూడా ఉందని, పౌర్ణమి ఈనెల 7వ తేదీ సాయంత్రం వరకు ఉంటుందని తెలిపారు. అందువల్ల 6న రాత్రి 11 గంటల 42 నిమిషాలకు కాముడి దహనం నిర్వహించి, 7న మంగళవారం హోలీ నిర్వహించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 7న హోలీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు గుద్దేటి చంద్రయ్య, బుచ్చారెడ్డి, అద్దని నరేంద్ర, నలిగేశ లక్ష్మీనారాయణ, హన్మంతు, గురురాజు తెలిపారు.

క్లుప్తంగా

కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి

నాగర్ కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దేశిటిక్యాల చెందిన కృష్ణారెడ్డి (50) గురువారం రాత్రి వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా, ప్రమాదవశాత్తు కేఎల్ఐ కాల్వలో జారిపడి మృతి చెందాడు. మృతదేహం శుక్రవారం ఉదయం నీటిపై తేలియాడుతుండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కాల్వ నుంచి మృతదేహాన్ని బయటకు తీ శారు. మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

చెక్‌డ్యాంలో పడి గొర్రెల కాపరి..


నాగరాజు (ఫైల్)

దేవరకద్ర రూరల్: నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెక్ డ్యాంలో పడి గొర్రెల కాపరి మృతిచెందిన సంఘటన శుక్రవారం రేకులంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేకులంపల్లి చెందిన అతినమోని నాగరాజు (38) వృత్తిరీత్యా గొర్రెల కాపరి. రోజులాగే గొర్రెలను తీసుకొని గురువారం గ్రామ శివారులోకి వెళ్లాడు. దాహం వేయడంతో సమీపంలోని చెక్‌డ్యాం వద్ద నీటిని తాగుతున్న క్రమంలో అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

కేబుల్ వైరుకు కొడవలి తగిలి రైతు మృతి


బంగ్లా రాంరెడ్డి (ఫైల్)

మరికల్: పశువులకు గడ్డి కోస్తుండగా విద్యుత్ కేబుల్‌కు కొడవలి తగిలి అక్కడికక్కడే రైతు మృతి చెందిన ఘటన శుక్రవారం రాకొండలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని రాకొండ చెందిన చెందిన బంగ్లా రాంరెడ్డి(65) ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పశువుల కోసం బోరు వద్ద ఉన్న పచ్చి గడ్డిని కొడవలితో కోస్తుండగా స్టార్టర్ నుంచి మోటర్ వరకు వెళ్లిన కేబుల్ వైరుకు కొడవలి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మహిళ గొంతు కోసి వ్యక్తి పరార్

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రానికి చెందిన జంగమ్మ గొంతును ఓ వ్యక్తి పదునైన ఆయుధంతో కోసి పరారయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని రైస్‌మిల్లు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగమ్మ సాయంత్రం మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల గుండా గొంతుపై గాటుతో రక్తపు మరకలతో మండల కేంద్రంలోకి వచ్చింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్నారు. తక్షణమే ఆమెను చికిత్స నిమిత్తం జడ్చర్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించారు. అటు నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తనను గొంతుపై కోసిన వ్యక్తి దేవయ్య అన్నట్లుగా జంగమ్మ పోలీసుల రాక ముందుగా చెప్పినట్లుగా స్థానికులు చెబుతున్నారు. కానీ ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు కాని, దాడికి గల కారణాలు బాధితురాలు వెల్లడించలేకపోయిందన్నారు. ఈ సందర్భంగా ఆమె గాయాలతో ఉండటంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేకపోతున్నామని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ షేక్ షంషోద్దీన్ తెలిపారు.

మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స

పాలమూరు: జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాజీపేట మండల కేంద్రానికి చెందిన మహిళను శుక్రవారం సాయంత్రం గొంతు కోసిన గాయాలతో పాటు ఇతర శరీర భాగాలపై తీవ్ర గాయాలు ఉన్నాయని ఆమెకు అవసరమైన మైనర్ సర్జరీలు చేసి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మహిళ ఆరోగ్యం, గాయాల నుంచి మహిళ కోలుకోవడానికి రెండు రోజుల సమయం పడుతుందని వెల్లడించారు.

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: వేధింపులకు గురి చేస్తున్న భర్త, కుటుంబ సభ్యులపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని లింగోటం చెందిన విజయ్, లావణ్య ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అదనపు కట్నం తీసుకురావాలని భర్త విజయ్, కుటుంబ సభ్యులు కొన్ని రోజులుగా వేధిస్తున్నారు. శుక్రవారం లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

నైజీరియా పక్షుల సందడి

వనపర్తి జిల్లాలోని మదనాపురం మండలం కొన్నూరులో విదేశీపక్షుల సందడి నెలకొంది. గ్రామంలోని రాళ్ల చెరువులో కొన్ని రోజులుగా పెద్ద సంఖ్యలో పొడవాటి కాళ్లతో కొత్తరకం పక్షులు సంచరిస్తున్నాయి. ఆఫ్రికాలోని నైజీరియా దేశం నుంచి ఈ పక్షులు ఏటా వేసవి కాలంలో వలస రావటం ఆనవాయితీ. సుమారు 5వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి, నీటితో ఉన్న చెరువులు, ఎక్కువగా చెట్లు ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఐదు నెలల పాటు ఇక్కడే ఉండి సంతానోత్పత్తి తర్వాత స్వదేశానికి వెళ్తుంటాయి.

- వనపర్తి/మదనాపురం



బైక్‌పై వచ్చి పుస్తెలతాడు అపహరణ

కల్వకుర్తి టౌన్: ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి దొంగలు పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్, బాధితురాలు మంజుల తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో నివాసం ఉండే మంజుల బస్టాండ్ ప్రాంతంలోని ఓ దుకాణంలో పనిచేస్తుంది. రోజు లాగానే పనిని ముగించుకుని ఇందిరానగర్ రోడ్డు నంబర్ 7 నుంచి నడుచుకుంటూ వెళ్తుంది. బైక్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు ఆమె మెడలోంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. మహిళ అరవటంతో పాటుగా బైక్‌ను వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు సంఘటనా స్థలంలో ఇళ్లకు ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఉద్యాన పంటలదే భవిష్యత్


ఉద్యాన కళాశాల విద్యార్థులతో ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు

- హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజప్రభాకర్

కొత్తకోట రూరల్: దేశంలో ఉద్యాన రంగానికి ఉన్న అపారమైన అవకాశాల దృష్ట్యా దేశ ఆర్థిక అభివృద్ధిలో భవిష్యత్‌లో ఉద్యాన రంగానిదే కీలక పాత్ర ఉండనుందని కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన కళాశాల వైస్ చాన్స్‌లర్ నీరజప్రభాకర్ తెలిపారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలో గల ఉద్యాన కళాశాలలో శుక్రవారం గ్రామీణ యువతకు ఉద్యాన రంగంలో వ్యాపార అవకాశాలపై ఒక రోజు జాతీయ శిక్షణ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం–తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. సేంద్రియ కూరగాయలు, పండ్లు, దేశవాళి రకాల విత్తన ఉత్పత్తి, తేనేటీగల పెంపకం, వర్మీ కంపోస్ట్, మృత్తిక పరీక్షలలో నైపుణ్యం సాధిస్తే, వాటిని గ్రామీణ యువత పరిశ్రమగా ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఉంటాయన్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉద్యాన పండ్లు, కూరగాయాలపై మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఇందుకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీ సాయిల్ బెస్ట్ సెన్సార్ టెక్నాలజీ, ఈ మార్కెట్లో అనుసంధానమై రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోగలిగితే గ్రామీణ వ్యవస్థ సైతం బాగుపడుతుందన్నారు. నైపుణ్యంతో కూడిన ఉద్యాన విద్యను అందించడమే ధ్యేయంగా వర్సిటీలో పాఠ్యాంశాల బోధన, ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమల స్థాపనకు విద్యార్థులు మొగ్గు చూపాలన్నారు. టిష్యూ కల్చర్ అరటి మొక్కల ఉత్పత్తిని, దేశవాలీ కూరగాయలలో నాణ్యమైన విత్తనాల ఉత్పత్తిని రైతు స్థాయిలో సైతం చేపట్టి పారిశ్రామికవేత్తగా ఎదగవచ్చని కార్యక్రమం కో ఆర్డినేటర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ పిడిగం సైదయ్య అన్నారు. రైతులని మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు కాల్గుడి సంస్థ ముందుంటుందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ వేణుమార్గం పేర్కొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు పొందిన ఫొటోగ్రాఫర్


జాతీయ అవార్డుకు ఎంపికైన ఫొటో


అవార్డుకు అందుకుంటున్న మహేష్

పెద్దకొత్తపల్లి: వనపర్తి ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా పాపికొండల్లో ఫిబ్రవరి 27, 28 తేదీలలో నిర్వహించిన కొమ్ము, కోయ, నృత్యక శాకారుల జీవన విధానం పై ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో వివిధ రాష్ట్రాల నుంచి 180 మంది ఫొటోలు రాగా అందులో మండలానికి చెందిన పిట్టల మహేష్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం వచ్చింది. అవార్డు అందుకున్న మహేష్‌ను మండల ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు రాజు, శ్రీనివాసులు, ఖాజా అభినందించారు.

అడవిలో పూరి గుడిసెలు దగ్ధం

మన్ననూర్: నల్లమల అడవి లోతట్టు ప్రాంత చెంచు పెంటలో వరుస అగ్నిప్రమాదాలతో చెంచులు ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని రాంపూర్ చెంచుపెంటలో శుక్రవారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటలకు నాలుగు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. ఐదు రోజుల క్రితమే పెంటలో గుడిసె దగ్ధమైంది. తిరిగి శుక్రవారం పెంటకు చెందిన చిగుర్ల లక్ష్మయ్య, నిమ్మల పాపయ్య, నిమ్మల బాలమ్మ గుడిసెలతో పాటు మినీ అంగన్‌వాడీ కేంద్రం కాలి బూడిదైంది. గుడిసెల్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, సోలార్ లైట్లు, బీరువాలు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. సంఘటన తెలుసుకున్న ఐసీడీఎస్, శిశు సంక్షేమ శాఖ అధికారులు రాంపూర్ పెంటను సందర్శించి మంటల్లో కాలిపోయిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.


మినీ అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

మంటలతో చెంచుల అయోమయం

రాంపూర్ పెంటలో సుమారు 25 చెంచు గుడిసెలు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గుడిసెలకు మంటలు అంటుకుంటున్నాయని అంటున్నారు. ఇదే పరిస్థితి ఉంటే అడవుల్లో చెంచుల బ్రతుకులు ఆరిపోతాయని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదివాసి చెంచులపై దయచూపి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వారు కోరుతున్నారు.

నెట్ పరీక్ష కేంద్రం ఎత్తివేత

- ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు హైదరాబాద్ కేంద్రానికి మార్పు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీజీ ఉత్తీర్ణత పొంది పీహెచ్‌డీ, జేఈఆర్ఎఫ్ పరీక్షలకు అర్హత సాధించిన నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు సంబంధించి ఉమ్మడి జిల్లాకు పరీక్ష కేంద్రాన్ని మహబూబ్‌నగర్‌కు ప్రభుత్వం కేటాయించేది. వివిధ సబ్జెక్టుల వారీగా ఈనెల 1వ తేదీ నుంచి 10 వరకు పరీక్షలు నిర్వహించారు. అయితే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రెండు సార్లు నిర్వహించేది. కరోనా ప్రభావం వల్ల రెండు సంవత్సరాలలో ఒకే సారి నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ, యూనివర్సిటీ, జూనియర్ కళాశాలల లెక్చరర్ పోస్టులను పెద్ద సంఖ్యలో వేస్తున్న నేపథ్యంలో చాలా మంది అభ్యర్థులు నెట్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకునే క్రమంలో వెబ్‌సైట్‌లో మహబూబ్‌నగర్‌లో పరీక్ష కేంద్రం ఉన్నట్లు చూపించింది. చాలా మంది మహబూబ్‌నగర్‌ను ఎంపిక చేసుకున్నారు. తీరా హాల్‌టికెట్‌లో చూస్తే హైదరాబాద్‌లోని పలు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షకేంద్రాలలో ఆన్‌లైన్ పరీక్ష రాసేందుకు కేటాయించారు. ఉద్యోగాలు చేసే వారు, పిల్లలు ఉన్న వారు, దివ్యాంగులు ఈ నిర్ణయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా జిల్లా కేంద్రం పక్కనే ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతి సంవత్సరం కేంద్రాన్ని టెస్టింగ్ ఏజెన్సీ కేటాయించేంది. ఈ క్రమంలో ప్రస్తుతం కొన్ని కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నెట్ పరీక్ష కేంద్రాన్ని కేటాయించలేదని సమాచారం . ఎన్నో ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్న కేంద్రానికి ఇప్పుడు తొలగిస్తే, ఇక భవిష్యత్‌లో కూడా పూర్తిగా తొలగిస్తారని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, లింగాల, అలంపూర్, అమరచింతలో పలు కారణాలతో నలుగురు బలవర్మణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది.

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబకలహాలతో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యాలవాడకు చెందిన కావలి వెంకటయ్య (53) కుటుంబంలో కొంతకాలంగా కలహాలు చోటుచేసుకున్నాయి. మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన దేశెట్టి లక్ష్మయ్య(29) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఎస్ఐ తెలిపారు. వీరి మధ్య మనస్పార్థాలు రావడంతో క్షణికావేశానికి గురై సొంత వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతునికి భార్య కల్పన, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మానసిక ఇబ్బందులతో..

అలంపూర్ రూరల్: మానసిక ఇబ్బందులో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాత బస్టాండ్ వీధికి చెందిన చుక్క నాగన్న (38) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. కాగా భార్య మానస శుక్రవారం ఉదయం కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. దీంతో ఇద్దరు పిల్లలతో తలుపులు పగలగొట్టి చూడగా నాగన్న ఉరేసుకుని కనిపించాడు. నాగన్న తమ్ముడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూరాల కాల్వలో దూకి ..


వెంకటేష్ (ఫైల్)

అమరచింత: జూరాల కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పట్టణానికి చెందిన ముష్టి వెంకటేష్ (52) స్థానికంగా సైకిల్ రిపేరు షాపు నిర్వహిస్తు కుటుంబాన్ని పోషించుకోనేవాడు. పనులు లేకపోవడంతో భార్య సుజాతతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్యను వేధించేవాడని స్థానికులు తెలిపారు. భార్య, పిల్లలను వదిలి పట్టణానికి వచ్చిన వెంకటేష్ మతిస్థిమితం లేక ఒంటరిగా జీవించేవాడు. నాలుగు నెలల కిందట కత్తితో గొంతు కోసుకున్నాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా భార్య, పిల్లలు దగ్గరుండి చూసుకున్నాడు. కోలుకున్న తర్వాత తరుచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. నాలుగు రోజుల క్రితం అమరచింతకు వచ్చి అలంపూర్ నియోజకవర్గం అయిజలో ఉన్న బంధువులను కలవడానికి వెళ్లాడు. తీరా జూరాల ప్రధాన ఎడమ కాల్వలో శుక్రవారం శవమై కనిపించాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆత్మకూర్ ఎస్ఐ మహేష్ తెలిపారు.

ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తా..

కందనూలు: కొందరు రాజకీయ నాయకులు ప్రజలను మోసం చేసేందుకు సర్వేలు చేస్తూ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కొందరు తప్పుడు సర్వేలను సృష్టించి సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేయడం, వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన తన గురించి నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసన్నారు. 15ఏళ్లుగా వైద్య సేవలు, 30ఏళ్లకు పైగా రాజకీయ సేవలు అందించిన తనను ప్రజలు గుండెల్లో పెట్టుకుని గెలిపించుకుంటారని అన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఉయ్యాలవాడ సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను తప్పుదోవ పట్టించి, మోసపు హామీలను ప్రకటించి ఎన్నికల రోజున రైతుబంధు వేయడం వల్లే తాను ఓటమి చెందానని అన్నారు. ఈ సారి ఎన్నికల్లో తన సత్తా చూస్తారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో రూ.500కే సిలిండర్ సరఫరా చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రచార ఆర్భాటాల కోసమే సామూహిక వివాహాలు చేశారని విమర్శించారు. సమావేశంలో నాగం శశిధర్‌రెడ్డి, రవి, జెడ్పీటీసీ సుమిత్ర, పాండు, నారాయణగౌడ్, అహ్మద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

రాజులా ప్రవర్తిస్తున్న సీఎం కేసీఆర్

అలంపూర్/ఉండవెల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాజులా ప్రవర్తిస్తున్నారని అందుకే ఎస్‌డీఎఫ్ ఫండ్ కింద తన వద్ద రూ.వెయ్యి కోట్ల నిధులు పెట్టుకున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నియోజకవర్గంలోని ఉండవెల్లి మండలంలో బహుజన రాజ్యాధికార యాత్ర శుక్రవారం కొనసాగింది. అదేవిధంగా అలంపూర్ మున్సిపాలిటీలో పర్యటించి స్థానిక ముస్లింలతో చర్చించారు. చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అలంపూర్ మండలంలోని ర్యాలంపాడు, జిల్లెలపాడు, సుల్తానాపురంకు కనీసం రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఈ గ్రామాలకు తుంగభద్ర మీద బ్రిడ్జి వేశామని పాలకులు మురిసిపోవడం తప్పా ఆ తర్వాత చేపట్టాల్సిన అభివృద్ధిని విస్మరించారన్నారు. జిల్లెలపాడుకు వెళ్తే ఈ ప్రాంతం తెలంగాణలోనా లేకా ఆంధ్రప్రదేశ్‌లోనా, ఆఫ్రికలో ఉందా అనే దయనీయ పరిస్థితులో కనిపిస్తాయన్నారు. ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఈ ప్రాంతానికి ఏం చేశారన్నారు. క్యాతూర్‌లోని ఎస్సీ కాలనీలో ఇళ్లు కూలడానికి సిద్ధంగా ఉన్న అక్కడ నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. బస్సులు లేక విద్యార్థులు చదువుల కోసం కష్టపడాల్సి వస్తుందన్నారు. అంగవైకల్యం ఉన్న వారు చేతులపై ఆధారపడి నడుస్తున్నప్పటికీ వారికి ట్రై సైకిల్ ఇవ్వలేదన్నారు. రోహ జాబీ గురించి ట్వీట్ చేస్తే ఎన్ఆర్ఐలు స్పందించి ట్రై మోటర్ సైకిళ్లు ఇవ్వడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. భైరాపురం, బస్వాపురం, సింగవరంకు కర్నూల్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పప్పుశనగ కేంద్రంలో కేవలం ఎకరాకు 6 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటున్నారన్నారు. మూడేళ్లుగా ఇక్కడ సీసీఐ కేంద్రాలు మూతపడి ఉంటే రైతులకు మీరు ఏం న్యాయం చేసినట్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం బొంకురు చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు, దొంగ సీడ్ ఆర్గనైజర్ల మాఫీయాపై ఏం చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్డీఎస్ నీళ్లు 40 ఏళ్లుగా చివరి ఆయకట్టు గ్రామాలకు చేరడం లేదన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లందించడానికి నిర్మించాల్సిన మల్లమ్మకుంట, వల్లూరు, జూలకల్ రిజర్వాయర్లు ఎక్కడికి పోయాయన్నారు. ఖదీర్‌ఖాన్ మృతికి కారణమైన పోలీసులపై చట్టపరంగా కేసు నమోదు చేయలేదన్నారు. హోంమంత్రి కూడా ఈ విషయంపై మాట్లాడలేదన్నారు. ముస్లింలకు ఇఫ్తార్ కాదు ఇన్‌సాఫ్ కావాలన్నారు. సమావేశంలో కేశవరావు, రాములమ్మ, మౌలాన షఫీ మసూది, అబ్రార్ హుస్సేన్ ఆజాద్, తదితరులు ఉన్నారు.


ఉండవెల్లి మండలం తక్కశీలలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కుక్కల దాడిలో దుప్పి మృతి

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని సార్లపల్లి సమీపంలో ఊర కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన దుప్పిని కుక్కలు వెంటాడాయి. దీంతో ఓ పాత ఇంట్లోకి వెళ్లిన దుప్పి కుక్కల దాడితో తీవ్ర గాయాలకు గురై మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని అటవీ సమీపంలోకి దుప్పి మృత కలేబరాన్ని తరలించి కాల్చివేశారు.

న్యాక్ గుర్తింపు కోసం సిద్ధం చేయండి


జడ్చర్ల కళాశాలను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్, అకడమిక్ గైడ్‌లైన్స్ అధికారులు

బల్మూర్: న్యాక్ (ఎన్ఏసీసీ) గుర్తింపు కోసం కళాశాలలో అన్ని రకాల విభాగాలను సిద్ధం చేయాలని ఆర్జేడీ యాదగిరి సూచించారు. మండలంలోని కొండనాగుల శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం సాయంత్రం ఆర్జేడీ, అకాడమిక్ గైడ్‌లైన్స్ అధికారి త్రివేంచలారి సందర్శించారు. కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. మారుమూల నల్లమల ప్రాంతంలో ఎంతో చేరువలో విద్యాదాత భగవంతరావు స్థాపించిన కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాలలోని భగవంతరావు విగ్రహానికి పూలమాల వేశారు. కళాశాలకు ఏ గ్రేడ్ న్యాక్ గుర్తింపు వచ్చేలా అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు.

కళాశాలను సందర్శించిన జాయింట్ డైరెక్టర్

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ యాదగిరి, అకాడమికల్ గైడ్‌లైన్స్ ఆఫీసర్ డి.టి.చారి సందర్శించారు. 15, 16 తేదీల్లో న్యాక్‌బృందం కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో సన్నాహక పనులను వారు పరిశీలించి సూచనలు చేశారు. న్యాక్ బృందం వచ్చిన సమయంలో ప్రవర్తించాల్సిన విధానాలపై టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సలహాలు ఇచ్చారు. ఏర్పాట్లపై ప్రిన్సిపాల్‌తో సమీక్షించారు. వారి వెంట ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, అధ్యాపకులు ఉన్నారు.

బాలుడిపై కుక్క దాడి

గద్వాల క్రైం: విద్యార్థిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం సాయంత్రం పట్టణంలో చోటు చేసుకుంది. బీసీకాలనీకి చెందిన బాలుడు శివశంకర్ ఇంటి వద్ద ఆడుకునేందుకు బయటకు వచ్చాడు. కుక్క అకస్మత్తుగా దాడి చేసి రెండు కాళ్లపై నోటితో కాటు వేసింది. గమనించిన స్థానికులు కుక్కను చెదరగొట్టారు. అనంతరం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. కాలనీలో కుక్కల బెడదపై మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా...



ఉత్తమ పవర్ ప్లాంటుగా ఎస్టీపీపీ

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) సంస్థ ఉత్తమ పవర్ ప్లాంటు నిర్వహణలో భాగంగా ఎస్టీపీపీకి ఈ అవార్డును అందించింది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు అందుకున్నారు. కాగా, ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో వరుసగా అవార్డులు అందుకోవడం విశేషం.

తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా అన్నమనేని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నమనేని సుధాకరరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా నర్సింగరావులను నియమిస్తున్నామని ఆ సంఘం ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంపా నాగేందర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం పరిశ్రమపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తిగా.. పరిశ్రమకు.. ప్రభుత్వానికి మధ్య వారధిగా సుధాకరరావు పనిచేస్తారని అభిప్రాయపడ్డారు.

'జూన్‌కల్లా రోడ్ల మరమ్మతులు పూర్తి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా కాలం తర్వాత పీరియాడికల్ రెన్యువల్ పనులలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర రహదారుల మరమ్మతులను జూన్‌కల్లా పూర్తి చేయాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ పనులపై శుక్రవారం ఆయన రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ప్రత్యేక కార్యదర్శి విజేంద్ర బోయి, ఈఎన్సీ రవీందర్‌రావులతో సమీక్షించారు. రూ.2875 కోట్లతో చేపట్టిన మొత్తం 1170 పనుల్లో 232 పనులు పూర్తి కాగా, మిగతా వాటిని వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల నిర్వహణ బాధ్యతను 60 ఏజెన్సీలకు అప్పగించినందున, ప్రతి ఏజెన్సీ వారానికి కనీసం ఒక్క పనైనా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

ఇక మొబైల్ ఆస్పత్రులు!

సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై దృష్టి
- మారుమూల పల్లెవాసులకూ మెరుగైన వైద్యానికి ప్రణాళిక
- పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎంపిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని మారుమూల ఆదివాసీ, గిరిజన పల్లెల్లో నివసించే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మొబైల్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వాటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

కదిలే ఆస్పత్రి...

మొబైల్ క్లినిక్‌గా తీర్చిదిద్దే వాహనంలో రోగనిర్ధారణ పరీక్షలు, ఔషధాలు, మైనర్ సర్జరీలు చేసేందుకు అనువైన వ్యవస్థ, రెండు బెడ్లు, టాయిలెట్ సదుపాయం ఉంటాయి. ఈ వాహనంలో ఒక డాక్టర్, ఒక ఏఎన్‌ఎం, ఒక మిడ్‌వైఫరీ, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారు. దీంతోపాటు టెలి మెడిసిన్ వ్యవస్థకు అనువైన సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో ఉంటుంది. ఎంపిక చేసిన మండలాల్లో పల్లె దవాఖానాలకు దూరంగా ఉన్న గ్రామాలు, గిరిజన గూడేలకు వారంలో రెండు, మూడుసార్లు రోడ్డు మార్గంలో వీలైనంత దగ్గర వరకు ఈ మొబైల్ క్లినిక్ చేరుకుంటుంది. అక్కడి ప్రజల ఆరోగ్య స్థితిగతులను వైద్యుడు, ఇతర సిబ్బంది పరిశీలించి తగిన మందులు అందిస్తారు. ప్రసవ సమయం దగ్గర పడిన నిండు గర్భిణులతో పాటు ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారిని గుర్తించి ముందుగానే పెద్దాస్పత్రులకు వాహనంలో తరలిస్తారు. మొబైల్ క్లినిక్‌ల వల్ల మారుమూల ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

భద్రాద్రి జిల్లాలో

మావోయిస్టు ప్రాభావిత ప్రాంతాల్లో వెనుకబాటుతనం రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏళ్లుగా భారీ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఏజెన్సీ ఏరియాల్లో రవాణా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా వైద్యసేవలు సైతం వారి చెంతకు చేర్చే పనికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటెలిజెన్స్ నోడల్ అధికారి ప్రభాకర్ చర్చించారు. జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మొబైల్ ఆస్పత్రులు ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ రెండు మండలాల్లో వైద్య సేవలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని గూడేల ఎంపిక, రూట్ మ్యాప్ ఎంపికపై కసరత్తు ప్రారంభించారు.

రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక..

రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అక్కడి అటవీ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలకు దూరంగా అనేక గిరిజన గూడేలు ఉన్నాయి. దీంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప సాధారణ పరిస్థితుల్లో వైద్యసేవల కోసం ప్రయత్నాలు చేయడం లేదు. ఫలితంగా పురిటి నొప్పులతోపాటు ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కానీ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో '108'వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంచాలు, డోలీలు, కుర్చీల్లో రోగులను ప్రధాన రహదారుల వద్దకు మోసుకెళ్లి అక్కడి నుంచి వాహనంలో ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రజల వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు మొబైల్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురానున్నారు.



రోగులను మంచంపై ఆస్పత్రికి తీసుకొస్తున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలు (ఫైల్)

232 కోట్లు ఎగ్గొట్టి 'పరుగులు'!

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని ప్రాంతాలకు చెందిన రవాణా వాహనాలను తనిఖీ చేయాలని లక్ష్యాలను నిర్దేశించారు.

గ్రేటర్‌లో ఆటోలు మినహా...

సాధారణంగా వ్యక్తిగత వాహనాలకు ఒకసారి జీవితకాల పన్ను చెల్లిస్తే చాలు. కానీ రవాణా వాహనాలకు మాత్రం ప్రతి 3 నెలలకోసారి త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల సామర్థ్యం మేరకు దీనిని నిర్ణయిస్తారు. వెయిట్ గ్రాస్ వెహికల్ (డబ్ల్యూజీవీ) ప్రకారం వాహనం బరువుకు అనుగుణంగా త్రైమాసిక పన్ను కనిష్టంగా రూ. 535 నుంచి గరిష్టంగా రూ. 15,000 వరకు ఉంటుంది. గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు జీహెచ్‌ఎంసీలోని సుమారు 1.4 లక్షల ఆటోలను ఈ త్రైమాసిక పన్ను జాబితా నుంచి ప్రభుత్వం మినహాయించింది. మిగతా అన్ని రకాల రవాణా వాహనాలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ జాబితాలో స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, లారీలు, క్యాబ్‌ల వంటి వాహనాలు ఉన్నాయి. కోవిడ్ కాలంలో పన్ను చెల్లించని రవాణా వాహనదారులు... కోవిడ్ ఆంక్షలను సడలించాక చాలా వరకు చెల్లించారు. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆర్టీఏ అధికారులు అప్పట్లో ఉదారంగా వ్యవహరించడం కూడా ఇందుకు కారణమైంది.

ఎంవీఐలకు పన్ను వసూలు టార్గెట్‌లు!

ఈ నెలాఖరు నాటికి బకాయిలు వసూలు చేయాలని రవాణా కమిషనర్ అధికారులను మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. అలాగే వారికి టార్గెట్‌లు విధించారని తెలియవచ్చింది. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోప్రతి ఎంవీఐకి రూ. 6 లక్షల చొప్పున టార్గెట్ విధించగా ప్రస్తుతం దాన్ని రూ. 7 లక్షలకు పెంచారని సమాచారం. ఈ లెక్కన ఆర్టీఏ కార్యాలయాల్లో పౌరసేవలు అందించే ఎంవీఐలు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోజుకు పన్ను చెల్లించని 5 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో ఉన్నవారు రోజుకు 10 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే జప్తు చేసిన వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ సదుపాయం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఓ ఎంవీఐ పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకొస్తేనే ఊరట...

త్రైమాసిక పన్ను పెండింగ్ జాబితాలో ఉన్న వాహన యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్ను చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదని అధికారులు చెబుతున్నారు. తనిఖీల్లో పట్టుబడితే మాత్రం 200 శాతం వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

బ్లాంక్ డీడీలతో దళారుల వసూళ్లు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీజ్ చేసిన వాహనాలపై పెనాల్టీతో సహా కట్టాల్సిన బకాయిల మొత్తానికి డీడీ తీసుకురావాలని అధికారులు చెబుతుండటంతో దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. వారు అప్పటికే వివిధ మొత్తాలతో బ్యాంకుల నుంచి తెచ్చిన ఖాళీ డీడీలు చూపి ఒక్కో డీడీపై 'సర్వీస్ చార్జీ'గా రూ.200 వసూలు చేస్తున్నారు. దీంతో ఆరొందల నుంచి రూ.1200 వరకు ఆ రూపంలో అదనపు భారం పడుతోంది. కళ్లముందే ఈ దందా జరుగుతున్నా రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు.

'షా'రొస్తున్నారు..!

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించనున్నారని పేర్కొన్నాయి.

ఇప్పటికే కర్ణాటకలో షురూ..

కర్ణాటకలో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. అయితే కొంతకాలం నుంచి కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందన్న అభిప్రాయం ఉంది. దీనికితోడు రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీ కాస్త పుంజుకుందన్న అంచనాలూ వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన బీజేపీ. ఆ రాష్ట్రంలో పార్టీని విజయతీరాలకు చేర్చే బాధ్యతను అమిత్‌షాకే అప్పగించింది. గత ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కకపోవడానికి నేతల మధ్య కుమ్ములాటలు, సమన్వయం లేకపోవడమే ముఖ్య కారణమని గుర్తించిన నాయకత్వం.. ఈసారి ఆ సమస్య పునరావృతం కాకుండా అమిత్‌షా నేతృత్వంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆ రాష్ట్రంలో యావత్ ఎన్నికల వ్యూహ రచన ఆయన కనుసన్నల్లోనే సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో.. అక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని, పూర్తి సమయం కేటాయించేందుకూ అమిత్‌షా సిద్ధమవుతున్నారు. కర్ణాటకలో ఎన్నికలు ముగిశాక.. అదే తరహాలో తెలంగాణపైనా దృష్టి పెట్టనున్నారు.

ఇప్పటికే పరోక్షంగా పర్యవేక్షణ

అమిత్‌షా ఇప్పటికే పరోక్షంగా రాష్ట్ర పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులు, బీఆర్‌ఎస్ సర్కార్ తీరు, సీఎం కేసీఆర్ వ్యవహారశైలి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తున్నారు. పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఆయన అదుపాజ్ఞలు, పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయని పార్టీ నేతలు చెప్తున్నారు. ఈ క్రమంలోనే అమిత్ షా, ఇతర అగ్రనేతలు కలసి.. గతంలో లోక్‌సభ, యూపీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం బన్సల్ నేతృత్వంలోనే 'ప్రజాగోస-బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత పటిష్టత, బూత్ సశక్తికరణ్ అభియాన్ వంటివి చేపడుతున్నారు. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఐదు విడతల్లో చేపట్టిన పాదయాత్రతో దాదాపు సగం అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అయ్యాయి. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పాదయాత్రలు కాకుండా.. రాష్ట్రంలోని నాలుగైదు రూట్లలో ముఖ్యనేతలంతా సమాంతరంగా పాల్గొనేలా రథయాత్రలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నట్టు పార్టీ నేతల సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే జాతీయ నాయకత్వం ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

ఏప్రిల్‌లో లోక్‌సభ సీట్లలో రథయాత్రలు

ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రూట్లలో రథయాత్రలు నిర్వహించాలని ఇటీవల అమిత్‌షా సూచించినట్టు తెలిసింది. దీనితోపాటు ఏప్రిల్ మొదటి వారంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల వారీగా రథయాత్రలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు ఎంపీ స్థానాల్లోని ఒక్కో అసెంబ్లీ స్థానం పరిధిలో ఒక్కో రోజు ఈ యాత్రలు సాగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఇక చేరికలు వేగవంతం!

రాష్ట్రంపై అమిత్‌షా పూర్తిగా దృష్టి సారించనున్న నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికలు ఇకపై వేగం పుంజుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర పార్టీ కోర్‌కమిటీ సభ్యులతో భేటీ అయినప్పుడు కూడా అమిత్‌షా ఈ విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇతర పార్టీల ముఖ్య నేతలు చేరకపోవడానికి కారణాలేంటి? ఎవరు అడ్డుపడుతున్నారు? వారి అభ్యంతరాలేమిటన్న దానిపై ఆయన నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. తొలుత జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలను చేర్చుకుంటే.. వారి వెంట అనుచరులు, కార్యకర్తలు తరలివస్తారని, పార్టీ బలోపేతం అవుతుందని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏయే జిల్లాల నుంచి ఏ పార్టీల నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? వారు డిమాండ్లు, విజ్ఞప్తులు ఏమిటన్న దానిపై రాష్ట్ర నేతల నుంచి విడివిడిగా జాబితాలు తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో త్వరలోనే చేరికలు ఊపందుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

సమన్వయం కోసం విందు భేటీలు!

రాష్ట్రంలో ప్రతి పదిహేను రోజులకోసారి కోర్ కమిటీ భేటీ నిర్వహించాలని కొన్నినెలల కింద జాతీయ నాయకత్వం ఆదేశించింది. ముఖ్య నేతల మధ్య సమన్వయం, అభిప్రాయాలు పంచుకోవడానికి, కార్యక్రమాల నిర్వహణపై సూచనల కోసం భేటీలు ఉపయోగపడతాయని భావించింది. కానీ అనుకున్నట్టుగా కోర్ కమిటీ భేటీలు జరగడం లేదు. ఇటీవలి ఢిల్లీ భేటీలో దీనిపై ప్రశ్నించిన అమిత్‌షా.. వారానికి ఒకరోజు నేతల నివాసాల్లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్ లేదా డిన్నర్ భేటీలు నిర్వహించి, కలుసుకుంటూ ఉండాలని సూచించినట్టు తెలిసింది. ఈటల రాజేందర్ నివాసంలో సమావేశంతో ఇలాంటి విందు భేటీలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నట్టు సమాచారం. అమిత్‌షా రంగంలోకి దిగనుండటంతో ఇకపై వరుసగా విందు భేటీలు, సమావేశాలు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, ఎవరైనా అమ్మితే విత్తన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులకు నకిలీ విత్తనాలను అరికట్టడం, ప్రాసెసింగ్, ప్యాకింగ్ అమ్మకాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీఏఓ మాట్లాడుతూ ప్రాసెసింగ్ రిజిస్టర్‌లను కచ్చితంగా నిర్వహించి లైసెన్స్‌లను చెల్లుబాటు ఉందో లేదో సరిచూసుకోవాలని అన్నారు. గడువు తీరిన విత్తనాలు అమ్మరాదని, ప్యాకెట్లపై లేబుల్ ఉండాలని, లూజ్ విత్తనాలు విక్రయించరాదని అన్నారు. లాట్, వెరైటీ ప్రకారం స్టాక్ రిజిస్టర్, ప్యాకెట్‌పై వ్యాలిడిటీ తేదీని కచ్చితంగా ముద్రించాలని తెలిపారు. కార్యక్రమంలో దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు, సాంకేతిక ఏడీఏ హైమావతి, సాంకేతిక వ్యవసాయ అధికారి మీనా, ఏఓలు శ్యాంయాదవ్, మురళీధర్, విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీరంగనాథస్వామి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో శ్రీరంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శ్రీవారి మూలమంత్ర వాహనం, సాయంత్రం శేషవాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రతిష్టించి ఊరేగించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు గోవిందనామస్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు.

వైఎస్సార్‌టీపీ కోఆర్డినేటర్ల నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్‌టీపీ సింగిల్ కోఆర్డినేటర్లను వైఎస్ షర్మిల నియమించారు. మండడి సరోజ్‌రెడ్డి (దేవరకద్ర), ఆర్.రవిప్రకాష్ (మహబూబ్‌నగర్), బి.మరియమ్మ (జడ్చర్ల), జి.నర్సింహగౌడ్ (నాగర్‌కర్నూల్), బి.వెంకటేశ్వర్‌రెడ్డి (వనపర్తి), దండు సిరి (అచ్చంపేట), కె.గంగాధర్ (మక్తల్), అతికుర్ రహెమాన్ (గద్వాల) నియమించారు.

హైదరాబాద్‌లో అతి పెద్ద స్కై టవర్స్

- ఐ జాయింట్ వీల్స్ సైతం.. లండన్ తరహాలో ఏర్పాటు
- తొలిదఫాలో దుర్గం చెరువు, ట్యాంక్ బండ్ వద్ద..
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి
- పర్యాటక అభివృద్ధిపై స్విట్జర్లాండ్ ప్రతినిధి బృందంతో సమీక్ష



ఇంటామిన్ ఎమ్యూజ్‌మెంట్ రైట్స్ ఉపాధ్యక్షుడు జెరార్డ్ స్లెండర్స్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అతిపెద్ద నగరంగా విస్తరిస్తోంది.. గూగుల్, ఆపిల్ వంటి ప్రపంచస్థాయి బహుళ జాతి కంపెనీలు ఇక్కడి నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఐటీ, టూరిజం సహా అనేక రంగాల్లో రాష్ట్రం పురోగామిలో పయనిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు మరిన్ని పర్యాటక సొబగులు సమకూరనున్నాయి. లండన్ తరహాలో అతిపెద్ద జాయింట్ వీల్స్, స్కైటవర్స్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కేసీఆర్ అర్బన్ ఎకో పార్కు (మయూరి)లో శుక్రవారం స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటామిన్ ఎమ్యూజ్‌మెంట్ రైట్స్ ఉపాధ్యక్షుడు జెరార్డ్ స్లెండర్స్‌తో పాటు సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భేటీ అయ్యారు. జాయింట్ వీల్స్, స్కైటవర్స్ ఏర్పాటుపై సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు.

తొలుత హైదరాబాద్‌లో..

ప్రపంచంలోనే అతిపెద్ద ఐ జాయింట్ వీల్స్ లండన్‌లో ఉన్నాయని.. దీని తరహాలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. మొదటిదశలో ట్యాంక్ బండ్, దుర్గం చెరువు వద్ద జాయింట్ వీల్స్, స్కై టవర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి సంబంధించి స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటామిన్ ఎమ్యూజ్‌మెంట్ సంస్థ ప్రతిపాదనలను తయారు చేసిందన్నారు. వీటిని ముఖ్యమంత్రికి సమర్పిస్తామని.. అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలో లేదా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్వహించేలా యోచన చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటి ఏర్పాటు వల్ల రాష్ట్రానికి రెవెన్యూపరంగా లబ్ధిచేకూరుతుందని.. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని వివరించారు.

ఆ తర్వాత సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లో..

రెండోదశలో సిద్దిపేటలోని కొండపోచమ్మసాగర్, మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కింద ఉదండాపూర్, కరివెన రిజర్వాయర్లు, ఆ తర్వాత మహబూబ్‌నగర్ సహా పలు చోట్ల కూడా అతిపెద్ద జాయింట్ వీల్స్, స్కై టవర్స్ నిర్మిస్తామని మంత్రి తెలిపారు. జెరార్డ్ స్లెండర్స్ మాట్లాడుతూ జాయింట్ వీల్స్, స్కై టవర్స్ ఏర్పాటు చేయడంలో తమ సంస్థ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందని.. హైదరాబాదులో అంతర్జాతీయ స్థాయి పర్యాటకాన్ని అభివృద్ధి చేసే అంశంలో తమ వంతు పాత్ర పోషిస్తామన్నారు. టూరిజం ఓఎస్డీ సత్యనారాయణ, స్వర్ణముఖి రిక్రియేషన్స్ ప్రతినిధి లాస్య, మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ నర్సింహ, డీఎఫ్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి 'కందూరు' బ్రహ్మోత్సవాలు

- 5న కల్యాణం, 7న రథోత్సవం
- 30 వరకు కొనసాగనున్న జాతర



కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయం

అడ్డాకుల: మండలంలోని కందూరు శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దివ్యక్షేత్రం బ్రహోత్సవాలు మొదలు కానున్నాయి. ఇందుకోసం ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈనెల 4 నుంచి 9 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. శైవులకు నిజకాశీలాంటి ఆలయం వద్ద శనివారం మొదలయ్యే ఉత్సవాలు మార్చి 30 శ్రీరామ నవమిన ముగుస్తాయి. కాశీలో తప్ప మరెక్కడా లేని కల్పవృక్షాలు(కబంధ) కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో కొలువైనాయి. కాశీ తర్వాత కల్ప వృక్షాలు ఇక్కడే ఉన్నాయని పురాణం చెబుతుంది.

27 కల్పవృక్షాలే 'ప్రత్యేకత'

11వ శతాబ్దంలో ఈ స్థల మహిమకు ముగ్ధుడై కాకతీయుల వంశానికి చెందిన ప్రతాపరుద్రుడు ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రలో ఉంది. తెలుగు ప్రాంతాన్ని ఏకీకృతం చేయడానికి రాణిరుద్రమదేవి పానగల్, ఖిల్లాలపై యుద్ధం చేయడానికి వచ్చినప్పుడు ఇక్కడే ఉండి వ్యూహరచన చేసినట్లు పూర్వీకులు చెబుతున్నారు. అయితే ఈ ఆలయం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 27 కల్పవృక్షాలే ఉండటం విశిష్టత. ఆకాశంలో ఉండే 27 నక్షత్రాలకు ప్రతీకగా ఆలయం పక్కన ఉన్న కో నేరు చుట్టూ 27 కల్పవృక్షాలే ఉన్నాయి. చాలా మంది ఆలయం వద్ద ఉన్న కల్పవృక్షాల వేర్లను తీసుకెళ్లి నాటినా అవి పెరగలేదు. కందూర్‌కు వెళ్తే కాశీకి వెళ్లినంత పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం.



ఆలయంలోని శివలింగం

కార్యక్రమాలు ఇలా..

4న భూతబలి, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ.
5న పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం
6న స్వామి వారి ప్రభోత్సవం
7న అర్ధరాత్రి రథోత్సవం(తేరు)
8న గవ్యాన్తం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, వృషభవాహన సేవ
9న రుద్రహోమం, మహాపూర్ణాహుతి, త్రిశుల స్నానం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తెలిపారు. మరుసటి రోజు నుంచి మొదలయ్యే జాతర మార్చి 30న శ్రీరామనవమి నాడు ముగియనుంది.

దర్శనీయ పర్వతంగా వట్టెం వెంకన్న



పూర్ణకుంభాన్ని తాకి నమస్కరిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి

బిజినేపల్లి: మండలంలోని వట్టెం అడ్డగట్టు పర్వత ఆకారం ఏనుగు శిరస్సు వంచి నమస్కరించినట్లుగా ఉండేదని, అందుకే వేంకటేశ్వరస్వామి వారి ఈ పర్వతంపై కొలువయ్యారని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. ఈ పర్వతం దర్శనీయ ప్రదేశమని, చుట్టూ ఉన్న పర్వతాలు కూడా దైవరూప పర్వతాలన్నారు. శుక్రవారం వట్టెం వేంకటేశ్వరస్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన తెల్లవారుజామున ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, గిరిజన మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, బతుకమ్మల ఆటాపాటలు, స్వామి వారి కీర్తనల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ.. పునర్వసు నక్షత్రం, పుష్కర ముగింపు, ఏకాదశి తిథి, శుక్రవారం రోజు మహిళా భక్తులచేత లక్ష్మీఅమ్మవారి పూజలు చేయించడంతో గొప్ప ఫలప్రదమైన రోజుగా పేర్కొన్నారు.

త్రిదండి చినజీయర్ స్వామి

ఈ ఆలయం మూడు దశాబ్దాల కింద నడవడానికి దారి లేని స్థాయి నుంచి ఉన్నతస్థాయి ప్రమాణాలతో దైవక్షేత్రంగా తీర్చిదిద్దారని, భవిష్యత్‌లో టీటీడీ మాదిరిగానే అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. వట్టెం అడ్డగట్టుపై కొలువైన తర్వాత ఈ ప్రాంతానికి జలసిరి వచ్చి పచ్చదనం పరుచుకుందని, ఇక్కడే నవోదయ విద్యాలయం, 16 టీఎంసీలతో రిజర్వాయర్ వచ్చిందని, చుట్టూ దైవక్షేత్రాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాబోయే రోజులు వట్టెం వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ప్రాతరాధన, చతుస్నార్చన, సేవా కాలం, మూలమంత్ర హోమం, నివేదన, మహా పూర్ణాహుతి, లక్ష్మీ నారాయణ పూజలు, పుష్కర సంచిక ఆవిష్కరణ, సయమారాధన, అంకురార్పణం, హోమం, కలశాధివాసం ఘనంగా నిర్వహించారు. రాత్రి కీర్తనలు, నృత్యాలు, సాంప్రదాయ కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

నైతిక విలువలు పెంచుకోవాలి

విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు పెంచుకోవాలని త్రిదండి చినజీయర్ స్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని వట్టెం నవోదయ విద్యాలయ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు నైతిక విలువలు, బాధ్యతలు, సేవా గుణాలు అలవర్చుకోవాలని, దైవత్వంపై నమ్మకంతో ఉండి పని చేయాలని సూచించారు.



లక్ష్మీనారాయణస్వామి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పట్టుదలతో చదివితే విజయం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయం సాధించడం పెద్ద కష్టమేమి కాదని ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ పాండు అన్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీఎస్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న విజయాలను సాధించవచ్చన్నారు. పదో తరగతిలో చదువును నిర్లక్ష్యం చేస్తే జీవితం నాశనమవుతుందన్నారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి విద్యార్థులకు హాస్టళ్లను ఏర్పాటు చేసిందని, పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచిగా చదువుకోవాలన్నారు. చెడు స్నేహాలు, చెడు తిరుగుళ్లు మానుకుని క్రమశిక్షణతో ముందుకెళ్లాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో మిమ్మల్ని చదివిస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. బాగా చదివి పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. బయోసైన్స్, హిందీ, సాంఘికశాస్త్రం, ఫిజికల్ సైన్స్ తదితర అంశాలపై నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక పాఠ్యాంశాలను బోధించారు. 400 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్, నోట్ బుక్స్, ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. అంతకు ముందు డీఈఓ యాదయ్య విద్యార్థులు ఎలా చదువుకుంటే విజయం సాధిస్తారో వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, వార్డెన్లు కృష్ణమోహన్, శివకుమార్, బాబురావు, తురియానంద్, మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అశోక్, శ్రీనివాస్, విష్ణు, పుష్పవేణి, తారాబాయి, యశోద తదితరులు పాల్గొన్నారు.